www.eenadupratibha.net

# BOARD OF SECONDARY EDUCATION (AP)

## SUMMATIVE ASSESSMENT – I

## TENTH CLASS TELUGU MODEL PAPER

## PAPER – I

సమయం: 2 గం. 45 ని. **పార్టు – A & B** గరిష్ఠ మార్కులు: 40

సూచనలు: 1) ప్రశ్నపత్రంలో పార్టు – A, B అనే రెండు విభాగాలుంటాయి.

2) పరీక్ష ప్రారంభంలోనే పార్టు – Aతోపాటు పార్టు – B కూడా ఇస్తారు.

3) మొదటి 15 నిమిషాలు ప్రశ్నపత్రం చదువుకోవడానికి, మిగిలిన 2 గం. 30 నిమిషాలు జవాబులు రాయడానికి కేటాయించారు.

4) పార్టు – B సమాధానాలు ప్రశ్నపత్రంలోనే రాయాలి.

సమయం: 2 గంటలు **పార్టు - A** మార్కులు: 30

**I. అవగాహన - ప్రతిస్పందన** (12 మార్కులు)

1. కింది పద్యాల్లో ఒక దానికి ప్రతిపదార్థం రాయండి. 1 × 4 = 4

**అ)** మ. తన చూ పంబుధిమీఁదఁ జాచి శ్రవణద్వంద్వంబు రిక్కించి వం
చిన చంచద్భుజముల్ సముత్కటకటీసీమంబులన్ బూన్చి తోఁ
క నభోవీథికిఁ బెంచి యంఘ్రు లిటియంగాఁ బెట్టి బిట్టూది గ్ర
క్కున నక్కొండ యడంగఁద్రొక్కి పయికిం గుప్పించి లంఘించుచోన్

(లేదా)

**ఆ)** మ. శివరాజంతట మేల్ముసుంగుఁ దెరలో - స్నిగ్ధాంబుదచ్ఛాయలో
నవసౌదామినిఁ బోలు నా యవనకాంతారత్నమున్ భక్తి గౌ
రవముల్ వాఱఁగఁ జూచి పల్కె "వనితారత్నంబు లీ భవ్యహైం
దవభూజంగము పుణ్యదేవతలు; మాతా! తప్పు సైరింపుమీ!"

2. కింది పద్యాల్లో ఒకదాన్ని పాదభంగం లేకుండా పూరించి భావం రాయండి. 1 × 4 = 4

**అ)** సురిచిరతారకా.............................................

.........................................పశ్చిమ దిక్తటంబునన్.

(లేదా)

**ఆ)** నీరముతప్త..................................

............................................నుత్తముగొల్చువారికిన్

www.eenadupratibha.net

**కింద ఇచ్చిన పరిచిత గద్యాన్ని చదివి ప్రశ్నలకు జవాబులు రాయండి.** **4 × 1 = 4**

ఈ పనిలో ఎందరో స్త్రీలను కలిశాం. వాళ్లతో మాట్లాడటమే పెద్ద ఉత్సాహంగా ఉండేది. వారి అనుభవాలు వింటుంటే ఉద్వేగం కలిగేది. చరిత్రను మా కళ్లముందు పరిచిన వారి జీవితాలను వినడం ఈ పనిలో మాకు అన్నింటికంటే ఆనందాన్ని ఇచ్చిన విషయం. సరిదె మాణిక్యాంబ 'అప్పుడు మా కులం వారిని ఆడవద్దన్నారు. తర్వాత అన్ని కులాల వారినీ ఆడవచ్చన్నారు. మా వృత్తి, పొలాలు, జీవనం అన్నీ తీసేసుకున్నారు. ఇప్పుడు ఇదే జీవనోపాధిగా అన్ని కులాల వాళ్లు బతుకుతున్నారు' అన్నప్పుడు సంస్కరణోద్యమ రథచక్రాల కింద నలిగిన ఎందరో స్త్రీలు మాకళ్ల ముందు మెదిలి కన్నీరు కార్చారు.

ప్రశ్నలు:

**3.** ఏ విషయం రచయితలకు ఆనందాన్ని ఇచ్చింది?

**4.** రచయితల కళ్లముందు మెదిలింది ఎవరు?

**5.** హక్కులను కోల్పోయిన తమ కులస్థుల గురించి ఆవేదన చెందింది ఎవరు?

**6.** పై పేరా ఆధారంగా ఒక ప్రశ్నను తయారు చేయండి.

## II. వ్యక్తీకరణ - సృజనాత్మకత (18 మార్కులు)

**కింది ప్రశ్నలకు 4 – 5 వాక్యాల్లో జవాబులు రాయండి.** **4 × 2 = 8**

**7.** మాతృభావన కవి గురించి మీకు తెలిసిన విషయాలు రాయండి.

**8.** 'వివేకహీనుడిని సేవించుట కంటే వనవాసముత్తమం'. సమర్థించండి.

**9.** 'మా ప్రయత్నం' పాఠం నేపథ్యాన్ని రాయండి.

**10.** 'మాణిక్యవీణ' పాఠంలో కవి వేటిని గొప్పరోజులు అన్నాడు?

**కింది ప్రశ్నలకు 10 – 12 వాక్యాల్లో జవాబులు రాయండి.** **2 × 5 = 10**

**11.** లోచనంబులకు నమృత సేచనంబును, శరీరమునకు చందనా సారంబును అందించిన వెన్నెల ఎలా విజృంభించిందో రాయండి.

**(లేదా)**

మాణిక్యవీణ కవితా సారాంశాన్ని సొంత మాటల్లో రాయండి.

**12.** 'అమరావతి'కి రాజధాని లక్షణాలున్నాయా? అమరావతి గొప్పదనాన్ని వివరిస్తూ రాయండి.

**(లేదా)**

చరిత్ర నిర్మాతలుగా స్త్రీలు ప్రధానంగా ఉన్నారనే భావన సంపాదకులకు కలగడానికి కారణాలను వివరించండి.

www.eenadupratibha.net

సమయం: 30 నిమిషాలు **పార్టు - B** మార్కులు: 10

**సూచన:** పార్టు – Bకి సంబంధించిన సమాధానాలు ఈ ప్రశ్నపత్రంలోనే రాసి పార్టు – A సమాధాన పత్రానికి జత చేయండి.

## III. భాషాంశాలు

★ గీత గీసిన పదానికి సరైన జవాబును బ్రాకెట్లో గుర్తించండి.

**13.** యౌవనం ఝరీ వేగతుల్యం (అర్థం గుర్తించండి). ( )

ఎ) సముద్రం బి) కొలను సి) సెలయేరు డి) చెరువు

**14.** పెరిగి గిరి గాడ్పుకొడుకు (అర్థం గుర్తించండి). ( )

ఎ) పర్వతం బి) నది సి) పీఠభూమి డి) మైదానం

**15.** రుగ్మత ఉన్న ఈ సమాజాన్ని బాగు చేయాలి. (పర్యాయ పదాలు గుర్తించండి). ( )

ఎ) రోగం, మందు బి) రోగం, వ్యాధి సి) వ్యాధి, మందు డి) అశరీరం, అనారోగ్యం

**16.** మా ఆజ్ఞన్ గమనింపవో (పర్యాయ పదాలు గుర్తించండి). ( )

ఎ) ఉత్తరువు, నేత్రం బి) ఆదేశం, నేత్రం సి) నిర్దేశం, నయనం డి) ఆదేశం, ఆన

**17.** వెన్నెల వెల్లి పాల్కడలి (నానార్థాలను గుర్తించండి). ( )

ఎ) వెలుగు, కాంతి బి) వెలుగు, ప్రవాహం సి) ప్రవాహం, వాగు డి) సెలయేరు, నది

**18.** మామిడి ఫలం దక్కింది (నానార్థాలు గుర్తించండి). ( )

ఎ) పండు, కాయ బి) కాయ, విత్తనం సి) పండు, ప్రయోజనం డి) విత్తనం, గింజ

**19.** జూలు కలది (వ్యుత్పత్తి పదాన్ని గుర్తించండి). ( )

ఎ) ధరాధరి బి) అమరి సి) జూలరి డి) కేసరి

**20.** పురంధ్రి (వ్యుత్పత్త్యర్థాన్ని గుర్తించండి). ( )

ఎ) గృహమును ధరించేది – ఇల్లాలు బి) పతిని సేవించేది – భార్య

సి) పతిని సేవించడం వ్రతంగా కలది – పతివ్రత డి) భర్తలో సగభాగమైంది – ఇల్లాలు

**21.** మూర్ఖులకు నీతులు ఎక్కువ (వికృతిని గుర్తించండి). ( )

ఎ) మెరక బి) మొరకు సి) మేరకు డి) మూర్ఖుడు

**22.** జతనంబున దిక్పతి కోటి ముందటన్ (ప్రకృతిని గుర్తించండి). ( )

ఎ) యత్నం బి) జతనం సి) ఎత్తు డి) ప్రయత్నం

**23.** 'కెందామరలు' విరిసె (పదాన్ని విడదీయండి). ( )

ఎ) కెన్ + తామరలు బి) కెంపు + తామరలు సి) కేలు + తామరలు డి) కేగు + తామర

**24.** వాడుగొట్టె (సంధిని గుర్తించండి). ( )

ఎ) నుగాగమ సంధి బి) పుంప్వాదేశ సంధి సి) త్రికసంధి డి) గసడదవాదేశసంధి

**25.** కిందివాటిలో అవ్యయీభావ సమాసానికి ఉదాహరణను గుర్తించండి. ( )

ఎ) ప్రతిదినం బి) పది గంటలు సి) ముక్కంటి డి) గంగానది



www.eenadupratibha.net
www.eenadupratibha.net

**26.** 'కూటాగ్రము' (విగ్రహ వాక్యాన్ని గుర్తించండి). ( )

ఎ) కూటము యొక్క వ్యగ్రము బి) కూటము యొక్క అగ్రము

సి) కూటము వలన అగ్రము డి) కూటమందలి వ్యగ్రము

**27.** 1 సూర్యగణం, 2 ఇంద్రగణాలు, 2 సూర్యగణాలు ఉండటం ఏ పద్య లక్షణం? ( )

ఎ) ఆటవెలది బి) తేటగీతి సి) సీసం డి) ద్విపద

**28.** 'మత్తేభం' గణాలను గుర్తించండి. ( )

ఎ) భరనభభరవ బి) మసజసతతగ సి) సభరనమయవ డి) నజభజజజర

**29.** 'కార్ముకం' (ఏ గణమో గుర్తించండి). ( )

ఎ) రగణం బి) జగణం సి) భగణం డి) తగణం

**30.** 'తోరణం శత్రువులతో రణానికి కారణమైంది'. ( )

ఎ) ముక్తపదగ్రస్తం బి) యమకం సి) స్వభావోక్తి డి) అర్థాంతరన్యాస

**31.** జాతి గుణ క్రియాదులను వర్ణించే అలంకారం ఏది? ( )

ఎ) ఉపమాలంకారం బి) స్వభావోక్తి సి) అర్థాంతరన్యాస డి) అతిశయోక్తి

**32.** కిందివాటిలో ఉత్ప్రేక్షాలంకారాన్ని గుర్తించండి. ( )

ఎ) బంతిలా వెలిగి పోతున్నాడు సూర్యుడు

బి) లోభము యననది సంద్రము లాంటిది

సి) నాగామిసేతు బంధాను రూపంబుగా జేయు గుణవర్త మోయనంగ

డి) కటకట! ధరణీ కటితట పటమనిపించుకున్న గన్న పారావారం

## జవాబులు

### పార్టు – A

**I. అవగాహన - ప్రతిస్పందన**

1. కింది పద్యాల్లో ఒక దానికి ప్రతిపదార్థం రాయండి.

అ) మ. తన చూ పంబుధిమీఁదఁ జాచి శ్రవణద్వంద్వంబు రిక్కించి వం
చిన చంచద్భుజముల్ సముత్కటకటీసీమంబులన్ బూన్చి తోఁ
క నభోవీథికిఁ బెంచి యంఘ్రు లిఱియంగాఁ బెట్టి బిట్టూది గ్ర
క్కున నక్కొండ యడంగఁద్రొక్కి పయికిం గుప్పించి లంఘించుచోన్

జ: ప్రతిపదార్థం

| | |
|---|---|
| తన చూపు | = తన కంటి చూపును |
| అంబుధిమీదన్ | = సముద్రంపై |
| చాచి | = బాగా ప్రసరింపజేసి |
| శ్రవణ ద్వంద్వంబున్ | = చెవుల జంటను |
| రిక్కించి | = నిక్కించి |
| వంచిన | = కొంచెం వంచిన |
| చంచద్భుజముల్ | = కదులుతున్న చేతులను |
| సముత్కట | = మిక్కిలి విశాలమైన |
| కటీ సీమంబులన్ | = మొలపై భాగాలందు |
| పూన్చి | = గట్టిగా ఉంచి |
| తోకన్ | = తన తోకను |
| నభోవీథికిన్ | = ఆకాశంలోకి |
| పెంచి | = ఎత్తుగా |
| అంఘ్రులు | = పాదాలను |
| ఇఱియంగా బెట్టి | = బిగించి పెట్టి |
| బిట్టూది | = గట్టిగా గాలి పీల్చి |
| గ్రక్కునన్ | = వెంటనే |
| అ క్కొండ | = ఆ మహేంద్ర పర్వతం |
| అడంగన్ | = అణిగి పోయేలా |
| త్రొక్కి | = కాళ్లతో తొక్కిపెట్టి |
| పయికిన్ | = ఆకాశంలోకి |
| కుప్పించి | = ఎగిరి |
| లంఘించుచోన్ | = దూకేటప్పుడు (ఎగిరెను) |



www.eenadupratibha.net
www.eenadupratibha.net

(లేదా)

ఆ) మ. శివరాజంతట మేల్ముసుంగుఁ దెరలో – స్నిగ్ధాంబుదచ్ఛాయలో
నవసౌదామినిఁ బోలు నా యవనకాంతారత్నమున్ భక్తి గౌ
రవముల్ వాఱఁగఁ జూచి పల్కె "వనితారత్నంబు లీ భవ్యహైం
దవభూజంగమ పుణ్యదేవతలు; మాతా! తప్పు సైరింపుమీ!"

జ:

| | |
|---|---|
| శివరాజు | = శివాజీ మహారాజు |
| అంతటన్ | = అప్పుడు |
| మేల్ముసుంగు | = సువాసినీ స్త్రీలు వేసుకునే మేలిముసుగు |
| తెరలోన్ | = తెర లోపల |
| స్నిగ్ధ | = దట్టమైన |
| అంబుద | = మేఘాల |
| ఛాయలోన్ | = నీడలో |
| నవసౌదామినిన్ | = కొత్త మెరుపు తీగను |
| పోలు | = పోలినట్లు ఉన్న |
| ఆ యవన కాంతారత్నమున్ | = ఆ రత్నం లాంటి యవన కాంతను |
| భక్తి గౌరముల్ | = భక్తిని, గౌరవాన్ని |
| పాలుగన్ + చూచి | = స్ఫురించేలా చూసి |
| పల్కెన్ | = ఈ విధంగా ఆమెతో అన్నాడు |
| వనితారత్నంబులు | = రత్నముల లాంటి స్త్రీలు |
| ఈ | = ఈ |
| భవ్య | = శుభప్రదమైన |
| హైందవ భూ | = భారత భూమిపై |
| జంగమ | = సంచరించే |
| పుణ్యదేవతలు | = పుణ్యప్రదమైన దేవతల లాంటివారు |
| మాతా | = అమ్మా |
| తప్పున్ | = మా వారు చేసిన తప్పును |
| సైరింపుమీ | = మన్నించండి |

2. కింది పద్యాల్లో ఒకదాన్ని పాదభంగం లేకుండా పూరించి భావం రాయండి.

అ) సురుచిరతారకా...............................................

......................................పశ్చిమ దిక్తటంబునన్.

జ: సురుచిరతారకాకుసుమశోభి నభోంగణభూమిఁ గాలమ
న్గరువపుసూత్రధారి జతనంబున దిక్పతికోటి ముందటన్
సరసముగా నటింపఁగ నిశాసతి కెత్తిన క్రొత్తతోపుఁ బెం
దెర యన నొప్పె సాంధ్యనవదీధితి పశ్చిమదిక్తటంబునన్.

**భావం:** ప్రకాశించే చుక్కలనే పూలతో అలంకరించిన ఆకాశం అనే రంగస్థలం మీద, కాలం అనే సూత్రధారి ప్రయత్నం వల్ల, దిక్పాలకుల సమూహం ముందు రాత్రి అనే స్త్రీ రసవంతంగా నాట్యం చేయడానికి సిద్ధపడగా, ఆమె ముందు పట్టుకున్న లేత ఎరుపు రంగు తెర ఏమో అనేటట్లుగా సంధ్యాకాలపు కొత్త కాంతి పడమట దిక్కున ప్రకాశించింది.

**(లేదా)**

**ఆ)** నీరము తప్త..................................

............................................**నుత్తముగొల్చువారికిన్**

**జ:** నీరము తప్తలోహమున నిల్చి యనామకమైన నశించు నా

నీరము ముత్యమట్లు నళినీదళ సంస్థితమై తనర్చునా

నీరమె శుక్తిలోఁబడి మణిత్వము గాంచు సమంచిత ప్రభన్

పౌరుష వృత్తులిట్లధమ మధ్యమ నుత్తము గొల్చువారికిన్.

**భావం:** కాల్చిన ఇనుము మీద నీళ్ల పడితే ఆవిరైపోయి, పేరు లేకుండా పోతాయి. ఆ నీళ్లే తామరాకుపైన పడితే ముత్యంలా కన్పిస్తాయి. అలాకాకుండా ముత్యపు చిప్పల్లో పడితే మణులుగా మారతాయి. అలాగే మనిషి అధముడిని చేరితే అధముడు అవుతాడు, మధ్యముడిని చేరితే మధ్యముడు అవుతాడు, ఉత్తముడిని చేరితే ఉత్తముడవుతాడు.

**కింద ఇచ్చిన పరిచిత గద్యాన్ని చదివి ప్రశ్నలకు జవాబులు రాయండి.**

ఈ పనిలో ఎందరో స్త్రీలను కలిశాం. వాళ్లతో మాట్లాడటమే పెద్ద ఉత్సాహంగా ఉండేది. వారి అనుభవాలు వింటుంటే ఉద్వేగం కలిగేది. చరిత్రను మా కళ్లముందు పరిచిన వారి జీవితాలను వినడం ఈ పనిలో మాకు అన్నింటికంటే ఆనందాన్ని ఇచ్చిన విషయం. సరిదె మాణిక్యాంబ 'అప్పుడు మా కులం వారిని ఆడవద్దన్నారు. తర్వాత అన్ని కులాల వారినీ ఆడవచ్చన్నారు. మా వృత్తి, పొలాలు, జీవనం అన్నీ తీసేసుకున్నారు. ఇప్పుడు ఇదే జీవనోపాధిగా అన్ని కులాల వాళ్లు బతుకుతున్నారు' అన్నప్పుడు సంస్కరణోద్యమ రథచక్రాల కింద నలిగిన ఎందరో స్త్రీలు మాకళ్ల ముందు మెదిలి కన్నీరు కార్చారు.

ప్రశ్నలు:

**3.** **ఏ విషయం రచయితలకు ఆనందాన్ని ఇచ్చింది?**

**జ:** వారి జీవితాలను గురించి వినడం అన్నింటికంటే ఆనందాన్ని ఇచ్చింది.

**4.** **రచయితల కళ్లముందు మెదిలింది ఎవరు?**

**జ:** సంస్కరణోద్యమ రథచక్రాల కింద నలిగిన ఎందరో స్త్రీలు, రచయితలు కళ్ల ముందు మెదిలారు.

**5.** **హక్కులను కోల్పోయిన తమ కులస్థుల గురించి ఆవేదన చెందింది ఎవరు?**

**జ:** సరిదె మాణిక్యాంబ.

**6.** **పై పేరా ఆధారంగా ఒక ప్రశ్నను తయారు చేయండి.**

**జ:** సరిదె మాణిక్యాంబ ఆవేదన ఏమిటి?

## II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

**కింది ప్రశ్నలకు 4 – 5 వాక్యాల్లో జవాబులు రాయండి.**

**7.** **మాతృభావన కవి గురించి మీకు తెలిసిన విషయాలు రాయండి.**

**జ:** గడియారం వెంకటశేష శాస్త్రి 1894లో జన్మించి, 1980లో మరణించారు. ఈయన కడప జిల్లాలోని జమ్మలమడుగు తాలుకా నెమళ్ల దిన్నె గ్రామంలో జన్మించారు. పొద్దుటూరు మున్సిపల్ హైస్కూల్లో తెలుగు పండితులుగా పనిచేశారు. రఘునాధీయము, శివభారతం, మురారి లాంటి రచనలు చేశారు. వెంకటశేష శాస్త్రి 'కవితావతంస', 'కవిసింహ', 'అవధాన పంచానన' అనే బిరుదులు పొందారు.

**8. 'వివేకహీనుడిని సేవించుట కంటే వనవాసముత్తమం'. సమర్థించండి.**

జ: 'వివేకహీనుడు' అంటే ఏది మంచో, ఏది చెడో గ్రహించలేనివాడు అని అర్థం. మంచి చెడులు గ్రహించలేని రాజును సేవించి, అతడి కొలువులో పనిచేయడం కంటే వనవాసం చేయడం ఉత్తమం. వనవాసం అంటే అడవిలో ఉండటం. రాజును సేవించి ఆయన కొలువులో ఉద్యోగం చేయడం వల్ల రాజాస్థాన ఉద్యోగి అనే గౌరవం లభిస్తుంది. కానీ రాజులందరూ వివేకం గలవారై ఉండరు. ఒక ఉద్యోగి కష్టపడి ఆలస్యమైనా, రాజు చెప్పిన పని చేయాలి. ఆలస్యం ఎందుకైందని రాజు శిక్షించాడంటే, ఆ రాజు వివేకహీనుడు అని చెప్పాలి. ఈ విధంగా వివేకం లేని రాజు వద్ద ఉద్యోగం చేయడం కంటే వనవాసం చేయడం మంచిపని అని దీని అర్థం.

**9. 'మా ప్రయత్నం' పాఠం నేపథ్యాన్ని రాయండి.**

జ: ఒక పుస్తకం తాత్వికతను, అంతఃస్సారాన్ని, ఆశయాలను, శ్రమను తెలియజేసేదే ముందుమాట. ముందుమాట వల్ల పుస్తకాన్ని చదవాలనే ఆసక్తి పెరుగుతుంది. మంచి పుస్తకాన్ని ఎలా ఎంపిక చేసుకోవాలో తెలుస్తుంది. అలాంటి ముందుమాటను పరిచయం చేయడమే ఈ పాఠ్యాంశ ఉద్దేశం. ఈ శతాబ్దంలో సామాజికంగా మార్పులు తీసుకువచ్చిన స్త్రీలను పరిచయం చేస్తూ రాసిన పుస్తకమైన 'మహిళావరణం' పీఠిక గురించి తెలియజేయడమే ఈ పాఠ్య నేపథ్యం.

**10. 'మాణిక్యవీణ' పాఠంలో కవి వేటిని గొప్పరోజులు అన్నాడు?**

జ: 'చక్రం' కనుక్కున్న రోజు, 'లిపి'తో రాసిన రోజు, నిప్పు కనుక్కున్న రోజు, చక్కగా నాట్యం చేసిన రోజు, మానవ చరిత్రలో మంచి రోజులు. మానవుడు అర్థవంతమైన భాషలు నేర్చుకున్న రోజు, చిన్న మాటలతో జానపద గీతలు అల్లుకున్న రోజు, ధాన్యం పండించిన రోజు, కళలను ఆదరించిన రోజు గొప్పరోజులని, పండుగ రోజులని, శుభదినాలని కవి వర్ణించాడు.

**కింది ప్రశ్నలకు 10 – 12 వాక్యాల్లో జవాబులు రాయండి.**

**11. లోచనంబులకు నమృత సేచనంబును, శరీరమునకు చందనా సారంబును అందించిన వెన్నెల ఎలా విజృంభించిందో రాయండి.**

జ: సూర్యాస్తమయం అయ్యింది. పద్మం ముడుచుకుంది. పడమట సంధ్యారాగ కాంతి కనిపించింది. చీకటి బాగా పెరిగి దిక్కులు, భూమి, ఆకాశం కలిసిపోయి కాటుక నింపిన భరిణెలా విశ్వం కనిపించింది. చంద్రుడు ఉదయించాడు. వెన్నెల ప్రవాహం పాలసముద్రంలా పొంగి ఆకాశాన్ని ముంచెత్తింది. చంద్రబింబం ఆ పాలసముద్రంలో గుండ్రంగా చుట్టుకున్న ఆదిశేషుడి శయ్యలా, చంద్రుడిలోని మచ్చ ఆ శయ్య మధ్యన ఉన్న విష్ణువులా కనిపించింది. చంద్రకాంత శిలల వానలతో, చకోరాల రెక్కల స్పర్శలతో, స్త్రీల చిరునవ్వుల కాంతులతో అతిశయించి, దిక్కులన్నింటినీ ముంచెత్తి వెన్నెల సముద్రంలా వ్యాపించింది. ఆ వెన్నెల అనే సముద్రపు నీటి నుంచి చంద్రుడు ఆవిర్భవించాడు.

**(లేదా)**

**ప్ర. మాణిక్యవీణ కవితా సారాంశాన్ని సొంత మాటల్లో రాయండి.**

జ: మంత్రాలకు చింతకాయలు ఎలా రాలవో, పద్యాల ధాటితో చింతలు తొలగిపోవు. మంత్రాలతో రోగాలు నయం కానట్లే, తంత్రాలతో సమాజ సమస్యలు దారికిరావు. సమాజం కడుపులో క్యాన్సర్‌తో బాధపడుతూ ఉంటే, అంతరిక్షంలోకి రాకెట్లు పంపి ఏం ప్రయోజనం. మనిషి పుట్టుకతోనే ప్రకృతిని చూసి సంతోషించాడు. అతడు ఆ ప్రకృతిని తన అధీనం చేసుకోవాలని ప్రయత్నించాడు. మానవుడు గుహల్లో జీవించే ఆదిమ కాలంలోనే గోడలపై జంతువుల బొమ్మలు గీశాడు. గజ్జెకట్టి నాట్యం చేశాడు.

చక్కని తీరుగా పదాలు పాడుకున్నాడు. చక్రం కనుక్కున్న రోజు, లిపితో రాసిన రోజు, నిప్పును కనుక్కున్న రోజు, మానవుడు అర్థవంతమైన భాషను నేర్చుకున్న రోజు, చిన్న మాటలతో జానపద గీతాలు అల్లుకున్న రోజు మానవ చరిత్రలో మంచి రోజులు, పండుగ రోజులు. అనాధిగా మానవుడి జీవనయాత్రలో కళాకవితలు, జ్ఞాన విజ్ఞానాలు మానవుడి వెంటనే ఉండి అతడితో నడుస్తూ, నడిపిస్తున్నాయి.

**12. 'అమరావతి'కి రాజధాని లక్షణాలున్నాయా? అమరావతి గొప్పదనాన్ని వివరిస్తూ రాయండి.**

జ: అమరావతిని పాలించిన ఆయా రాజుల పరిపాలనా విధానాలు, మతాచారాలు, సంస్కృతి సంప్రదాయాలు అమరావతిపై మంచి ప్రభావాన్ని చూపాయి. అందువల్ల అమరావతి ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక రాజధాని అయ్యింది. ఇక్కడ జైన, బౌద్ధ, శైవ, వైష్ణవ, ముస్లిం, క్రైస్తవ మత సంప్రదాయ, సంస్కృతుల ప్రభావాలు కనిపిస్తాయి. క్రీ.పూ. 5వ శతాబ్దంలో గౌతమబుద్ధుడు అమరావతిని

సందర్శించాడు. 2006లో ప్రపంచ బౌద్ధ మతగురువు దలైలామా ఇక్కడ కాలచక్ర మహాసమ్మేళనం నిర్వహించారు. అమరావతిలో బుద్ధుడి ధాతువులను భద్రపరచిన భరిణపై మహాచైత్యాన్ని నిర్మించారు. ఆ రోజుల్లో అక్కడ బౌద్ధ విశ్వవిద్యాలయం ఉండేది. 12వ, 13వ శతాబ్దాల్లో శైవమతం బాగా వ్యాప్తి చెందింది. శివుడి ఆత్మలింగంలో ఒక భాగాన్ని ఇంద్రుడు అమరావతిలో ప్రతిష్ఠించాడని పురాణగాథ ప్రచారంలో ఉంది. ఇక్కడ ఉన్న అమరలింగేశ్వరస్వామి ఆలయం పంచారామాల్లో ఒకటి. ఈ విధంగా అమరావతి అన్ని మతాలవారితో ఆధ్యాత్మిక కేంద్రంగా శోభిస్తుంది.

**(లేదా)**

ప్ర. **చరిత్ర నిర్మాతలుగా స్త్రీలు ప్రధానంగా ఉన్నారనే భావన సంపాదకులకు కలగడానికి కారణాలను వివరించండి.**

జ: 20వ శతాబ్దం సామాజిక అభివృద్ధి మార్పుల్లో స్త్రీల భాగస్వామ్యాన్ని గురించి ఆలోచిస్తే చరిత్ర నిర్మాతలుగా వారికి తిరుగులేని స్థానం ఉందని సంపాదకులకు అనిపించింది. 20వ శతాబ్దంలో స్త్రీలు చేసిన పోరాటాలు, రాణించిన రంగాలు ఎన్నో ఉన్నాయి. అలాంటి స్త్రీలు ఎంతోమంది ఉన్నారు. చదువుకున్న స్త్రీలు ఉద్యమాల్లో చేరి జైలుకు వెళ్లేందుకు కూడా సిద్ధపడ్డారు. వితంతు వివాహం చేసుకునేందుకు సాహసించిన స్త్రీలు, స్త్రీ విద్య కోసం ఉద్యమించినవారు; నాటకం, సినిమా రంగాల్లో మొదటిసారి అడుగు పెట్టిన వారు ఎందరో ఉన్నారు. దీంతో చరిత్ర నిర్మాతలుగా స్త్రీలు ప్రధాన పాత్ర పోషించారు అనే భావన సంపాదకులకు కలిగింది.

**పార్టు - B సమాధానాలు**

13-సి; 14-ఎ; 15-బి; 16-డి; 17-బి; 18-సి; 19-డి; 20-ఎ; 21-బి; 22-ఎ; 23-బి; 24-డి; 25-ఎ; 26-బి; 27-బి; 28-సి; 29-ఎ; 30-బి; 31-బి; 32-సి.

**రచయిత: కె. లీలాకుమార్**

www.eenadupratibha.net